www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 జూన్ 2023



పోలీసు ఫుడ్‌కోర్ట్ లీజుకు..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:
జిల్లా ఎస్పీ ఆదేశానుసారం చిత్తూరు నగరంలో పోలీస్ గెస్ట్ హౌస్ పక్కన ఉన్న పోలీస్ ఫుడ్‌కోర్ట్‌ను లీజుకు ఇవ్వవలసిందిగా నిర్ణయించారు. కావున ఫుడ్‌కోర్ట్‌ను లీజుకు తీసుకొనేందుకు ఆసక్తి కలిగిన వారు లీజుకు సంబంధించిన సమాచారం కొరకు చిత్తూరు ఆర్మ్డ్ రిజర్వు ఆఫీస్‌లో ఆర్ఐ అడ్మిన్ నీలకంటేశ్వరరెడ్డి ఆఫీస్‌ను లేదా 94409 00747 నెంబర్ కు సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో పోలీస్‌శాఖ కోరింది.

ప్రాజెక్టులు పూర్తి అయితే..

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి

ఎంపీ మిథున్ రెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు
పుంగనూరు నియోజకవర్గంలో చేపట్టిన ప్రాజెక్టు పనులు పూర్తయితే రైతాంగానికి సాగు, తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని లోక్‌సభ ప్యానల్ స్పీకర్ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గపరిధిలో పరిశ్రమలు పెట్టాలన్న పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలన్న ప్రధానంగా నీటిసమస్య ఉందన్నారు. దీనివలన ప్రాజెక్టులు పెట్టడానికి ఎవరు ముందుకు రావడం లేదన్నారు. అందులో భాగంగా ప్రాజెక్టులు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు రైతులకు సాగునీరు ఇవ్వడంలో భాగంగా మన నియోజకవర్గ పరిధిలో రెండు ప్రాజెక్టుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుండి అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టడం జరిగిందని చెప్పారు. ఆ పనులు కూడా దాదాపు 90శాతం పూర్తి కావడం జరిగిందన్నారు. పుంగునూరు నియోజకవర్గంలో పూర్తిగా అభివద్ధి జరిగితే రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీకి మనుగడ ఉండదనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీకి చెందిన 34మంది న్యాయస్థానాల్లో కేసులు వేసి ప్రాజెక్టు నిర్మాణాలను తాత్కాలికంగా నిలపడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికల ముందు పాదయాత్రలో చెప్పిన హామీలన్నిటిని పూర్తి చేయడంలో భాగంగా బైపాస్ రోడ్డు, ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రాజెక్టుల ద్వారా తాగు, సాగునీరు అందించడం కోసం దాదాపు రూ.2144కోట్లతో తంబళ్లపల్లి వద్ద ఒక ప్రాజెక్టు, పుంగనూరు నేతిగుట్లపల్లి వద్ద ఒక ప్రాజెక్టు, సోమల ఆవులపల్లె వద్ద ఒక ప్రాజెక్టు మూడు ప్రాజెక్టులు పనులు పూర్తిచేసి పశ్చిమ ప్రాంతాలైన మదనపల్లి, పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లి ప్రాంతాలను సస్యశ్యామలం చేయడం లక్ష్యంగా తాము ముందుకు వెళ్లడం జరుగుతున్నదని అన్నారు. నేతిగుట్లపల్లె ప్రాజెక్టు నుంచి ఒకటిన్నర టీఎంసీ నీళ్లు, ఆవులుపల్లి ప్రాజెక్టు నుండి మూడున్నర టీఎంసీల నీరు నిలువ ఉంచి ఈ ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలను అనుసంధానం చేసి ప్రతి రైతుకు నీళ్లు ఇచ్చే విధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడానికి ఏకాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో తమ వ్యక్తిగత సంస్థ ద్వారా ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఒక రూపాయి రాకపోయినప్పటికీ సొంత డబ్బులు ఖర్చుచేసి ప్రజాప్రయోజనం కొరకు ఈ ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టుల భూములు కోల్పోయిన బాధితులకు ప్రతిఒక్కరికి పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. ఏ రైతు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతిపక్షాల మాటలు విని రైతులు ఇబ్బంది పడకూడదని తెలిపారు. అక్కడ భూమి విలువ ఎకరాకు రూ.4లక్షలు ఉంటే రైతులకు మేలు చేసే విధంగా ఎకరాకు రూ.12లక్షలు పరిహారం ఇస్తున్నామన్నారు. ఇవన్నీ రైతులు తెలుసుకొని ముందుకు వెళ్తే బాగుంటుందని చెప్పారు. సమ్మర్ స్టోరేజ్ నిర్మించి డబ్బులు దండుకొన్నామని కొంతమంది ఎన్నికల ముందు వచ్చి కారుకూతలు కూస్తున్నారని, సమ్మర్ స్టోరేజ్ నింపాలంటే కష్ణానది నుండి హంద్రీనీవా ద్వారా నీళ్లు రావాల్సి ఉంటుందని కష్ణాజలాలు అనంతపురంకు పరిమితం కావడంతో నీళ్లు రాక సమ్మర్ స్టోరేజ్ నింపలేదనే విషయం ప్రతిపక్ష నాయకులు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత జిల్లా గండికోట రిజర్వాయర్ నుండి ఇప్పుడున్న హంద్రీనీవా కాలువను మూడింతలు చేసి నీరును కాలువా ద్వారా తీసుకొచ్చి కుప్పం వరకు తాగునీరు సాగునీరు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నీటితో సమ్మర్ స్టోరేజ్ నింపి పట్టణ వాసులకు తాగునీరు అందివ్వడం జరుగుతుందని అన్నారు. పార్టీలు ఎన్ని ఇబ్బందులు పెట్టిన ప్రాజెక్టులు ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మూడ చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, జానపద కళల చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ హలీంబాష, ఎంపీపీ భాస్కర్ రెడ్డి, జెడ్పిటిసి జ్ఞానప్రసన్న చంద్రారెడ్డి యాదవ్, జింక వెంకటచలపతి, నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో..

ఆటో(వాలా)లపై ఆంక్షలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:
ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు ఆటో వాలాలపై ఆంక్షలు విధిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య కేవలం ఆటోల వల్లే ఏర్పడుతోందనేది ట్రాఫిక్ పోలీసులు వాదన. నిరుద్యోగ సమస్యతో పొట్టకూటి కోసం అనేక మంది ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిత్తూరు నగరంలో దాదాపు వెయ్యి మందికి పైగా లగేజి, ప్యాసింజ్ ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ఛార్జీలతో ఆదాయం అంతతమాత్రమే. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో ఆంక్షలు విధిస్తే ఆటోవాలాలకు ఇబ్బందులు తప్పవని ట్రేడ్ యూనియన్ నేతలు ఆటోడ్రైవర్ల యూనియన్ నేతలు ట్రాఫిక్ పోలీసులు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు విధిస్తున్న నిబంధనల్లో కొన్ని ఉపయోగకరంగా ఉన్నా రాత్రి సమయాల్లో ఆటోలు నడిపే డ్రైవర్లు పోలీస్‌స్టేషన్లలో సంతకాలు పెట్టడం, స్టేండ్లలోనే ప్రయాణికులను ఎక్కించుకోవాలనే నిబంధనలు తొలగించాలని కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న చిత్తూరు నగర ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ట్రాఫిక్ పోలీసులు పూనుకోవడం మంచిదే. అయితే రోడ్ల వెడల్పు అర్ధతరంగా ఆగిపోయింది. ఇరుకైన రోడ్లు అయినటువంటి కట్టమంచి నుండి రెడ్డిగుంట వరకు రోడ్డు విస్తరణ చేయలేదు. పైగా డివైడర్లు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ లేవు. ఆటో స్టాండ్లలో మాత్రమే ప్రయాణికులను ఎక్కించుకోవాలంటే ఉన్న ఆటో స్టాండ్లు నిబంధనలపేరుతో తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా హైరోడ్డుపై పార్కింగ్ లేకుండా నడుస్తున్న హోటల్స్, మాల్స్, బట్టల దుకాణాలను వదిలేసి ఆటోడ్రైవర్లపై నిబంధనల పరిట ఆంక్షలు పెడితే ట్రాఫిక్ కంట్రోల్ అవుతుందా అనే విషయాన్ని ట్రాఫిక్ పోలీసులు ఓసారి ఆలోచించాలి.

ట్రాఫిక్ సమస్యకు కారణాలివే...
నగరంలో ఇరుకైన రోడ్లు ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం. నగర జనాభా పెరగడంతో కార్లు, ద్విచక్రవాహనాలు కూడా పెరిగాయి. నిత్యం రద్దీగా ఉండే చర్చివీధిలో గత ప్రభుత్వంలో రోడ్డుకు ఇరువైపులా పుట్‌పాత్ ఏర్పాటు చేసినా ఆక్రమణలకు గురైయ్యాయి. హైరోడ్డులోని హోటల్స్, షాపింగ్ మాల్స్‌కు పార్కింగ్ లేక రోడ్లపైనే కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఎంఎల్ఎస్ఆర్ సర్కిల్‌లో రోడ్డుపైనే ప్రైవేట్ బస్సులు ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటారు. హోటల్ ప్రభాగ్రాండ్ ఇన్ ముందు నిత్యం రోడ్డుపైనే ద్విచక్రవాహనాల పార్కింగ్ చేస్తుంటారు. హైరోడ్డపై ఉన్న సిమెంట్, స్టీల్ హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు లోడింగ్, అన్ లోడింగ్ సమయాల్లో లారీలు, ట్రాక్టర్లు రోడ్డపైనే పెట్టి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసుల నిబంధనలు..

1. ఆటో నడిపే వారు వారికి కేటాయించిన ఆటోస్టాండ్‌లలో మాత్రమే పార్క్ చేసుకోవాలి.
2. ఆటో డ్రైవర్‌లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలి.
3. ప్రయాణికుల కోసం ఆటోలను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆపకూడదు.
4. ఆటోకు సబంధించిన అన్ని రికార్డులు ఎల్లప్పుడు ఆటోలో పెట్టుకోవాలి.
5. రాత్రి వేళలో ఆటో నడిపే వారు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో రికార్డు బుక్‌లో వారి వివరాలు రాసి సంతకం చేయాలి.
6. మద్యం తాగి ఆటోలు నడపరాదు.
7. లగేజ్ ఆటోవారు పై నిబంధనలు పాటిస్తూ ఓవర్ లోడ్ లేకుండా చూసుకోవాలి.
8. ఆటో డ్రైవర్లు వారి ఆటో రికార్డులు, ఆధార్ కార్డు, లైసెన్స్ వగైరాలు చిత్తూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చి తగా దాఖలాలు పొందవలెను.
9. సదరు రికార్డులన్నీ చిత్తూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయబడును.
10. ప్రతి ఆటోకు చిత్తూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వారు ఒక సీరియల్ నెంబర్ కేటాయించడం జరుగుతుంది.
11. సదరు నెంబర్లు లేని ఆటోలు నడిపితే వాటిని సీజ్ చేయడం జరుగుతుంది.
12. చిత్తూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వారిచే పొందిన సీరియల్ నెంబర్‌ను ఈ కింద కనబరిచిన నమూనా ప్రకారం ప్రతి పాసెంజర్ ఆటో ముందు, వెనక వైపున కనిపించే విధంగా పెయింటింగ్ చేయుంచుకోవాలి.
13. ప్రతి ఆటోలో ఈకింద తెలిపిన రెండవ నమూనాల ప్రకారం డ్రైవర్ సీటుకు వెనుక వైపున ఆటో డిస్‌ప్లే విధివిధానాలు అమర్చవలెను.

రోడ్ల విస్తరణపై దృష్టి పెట్టాలి
-పి. చైతన్య, మన చిత్తూరు అభివృద్ధి వేదిక కన్వీనర్
ట్రాఫిక్ నియంత్రణ కోసం రోడ్ల విస్తరణపై దృష్టి పెట్టకుండా ఆటోలపై ఆంక్షలు పెట్టడం సరికాదు. ప్రధానంగా నగరంలోని హైరోడ్డు విస్తరణ కీలకం. మాల్స్, హోటల్స్ పార్కింగ్ లేకుండా నడుస్తున్నాయి. కొన్ని కళ్యాణ మండపాలకు వాహన పార్కింగ్ లేదు. రోడ్లపైనే వాహనాలు పెట్టడం వల్ల ట్రాఫిక్ సమస్య వస్తోంది. ఆటో స్టాండ్లు లేవు. స్టాండ్లు ఏర్పాటు చేసుకొనేందుకు మున్సిపాల్టీ స్థలాలు ఇవ్వాలి. చర్చివీధిలో పుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి. సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఆటో డ్రైవర్లపై ఆంక్షలు పెట్టడం సరికాదు
- విజయ్‌కుమార్, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు
ట్రాఫిక్ నిబంధనల మేరుతో ఆటో డ్రైవర్లపై ఆంక్షలు పెట్టడం సరికాదు. అనేక మంది నిరుద్యోగులు ఉపాధి కోసం ఆటోలు నడుపుకుంటున్నారు. రోజంతా కష్టపడి ఆటో నడిపితే రూ.2 నుంచి 3వందలు మాత్రమే సంపాదిస్తున్నారు. రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు అపరాధ రుసుములు వేస్తున్నారు. ఆటోస్టాండ్ల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి. రాత్రి సమయాల్లో పోలీస్ స్టేషన్‌లో సంతకాలు పెట్టాలనే నిబంధన తొలగించాలి.

రైతు భరోసా, పిఎం కిసాన్ పథకం నిధులు విడుదల

రూ.170.84 కోట్లు లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రైతులకు ఆర్థిక చేయుత అందించాలని రాష్ట్ర ప్రభుత్వం వైయస్సార్ రైతుభరోసా, పిఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తున్నదని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 - 2024 సంవత్సరానికి సంబంధించి మొదటి విడతగా చిత్తూరు జిల్లాకు సంబంధించి 2,27,010 మంది రైతులకు గాను రూ.170.84కోట్లును రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమచేయడం జరుగుతుందని తెలిపారు. వర్చువల్ విధానం ద్వారా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లాకు సంబంధించి గురువారం ఉదయం 10గంటలకు పట్టణంలోని నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొనున్నారని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

స్పీకర్‌పై దేశం నేతల ఫిర్యాదు




వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: టిడిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పై శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం జెడ్ కేటగిరి సెక్యూరిటీపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై తెలుగుదేశం నేతలు బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు దొరబాబు, కఠారి హేమలత మాట్లాడుతూ స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తి జెడ్ కేటగిరి సెక్యూరిటీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. జెడ్ క్యాటగిరి తొలగిస్తే చంద్రబాబు పని పినిష్ అని అసాంఘిక శక్తులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన మాటల్లో కుట్ర కోణాన్ని దాగి ఉందని అన్నారు. తమ్మినేని సీతారాంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెంకీటీల సురేంద్ర కుమార్, కోదండ యాదవ్, ప్రభుతేజ, వరలక్ష్మి, సురేష్, కటారి లావణ్య, ధరణి ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుపతి జూకు చేరిన కొత్త జంతువులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):
తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలకు కేరళ రాష్ట్రం త్రివేండ్రం జూ నుండి నాలుగు హైనాలు, ఆరు హాగ్ డీర్ లను అధికారులు తెప్పించారు. బుధవారం జూలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలో వాటిని అధికారులు విడిచిపెట్టారు. కాగా మంగళవారం కర్నూలు జిల్లా నుండి ఇటీవల తిరుపతి జూకు తీసుకువచ్చిన నాలుగు పెద్దపులి పిల్లల్లో ఒకటి అనారోగ్యంతో మతి చెందిన విషయం విదితమే. మిగిలిన మూడు పెద్ద పులి పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నాయని జూవర్గాలు తెలిపాయి.





ప్రజాసమస్యల పరిష్కారమే.. జగనన్న ధ్యేయం

డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి



పెట్రోల్ బంకును ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: గ్రామ ప్రజల సమస్యల పరిష్కారమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని డిప్యూటీ సిఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని మండలంలోని ఎమ్.పురం గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లిక తనయుడు అమతరాజ్‌తో కలిసి నిర్వహించారు. డిప్యూటీ సిఎం మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలలో భాగంగా అన్ని పథకాలు ప్రతి పనికి అందేలా చూడాలని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి గురువారెడ్డి జనార్ధన్, కుప్పయ్య శ్రీధర్, బాల, తహశీల్దార్ లోకనాథ్ పిల్లై, ఎంపీడీవో కష్ణయ్య పాల్గొన్నారు.

పెట్రోల్ బంకును ప్రారంభించిన డిప్యూటీ సిఎం
మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం పుల్లూరు క్రాస్ రోడ్‌లో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును రాష్ట్ర డిప్యూటీ సీఎం కలతూరు నారాయణస్వామి పునఃప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు యజమాని గోపి ఈసందర్భంగా మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా మూతపడ్డ పెట్రోల్ బంకును గ్రామీణ ప్రాంత ప్రజలు, వినియోగదారుల సౌకర్యం కోసం కషిచేసి పెట్రోల్ బంకును ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ హరితకుప్పయ్య, గురువారెడ్డి, రమణ, ప్రసాద్‌రెడ్డి, జనార్ధన్ పాల్గొన్నారు.

పత్రికా విలేకరులపై

తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



ప్రజాశక్తి- పలమనేరు: వెదురుకుప్ప మండలంలో ప్రజాస్వామ్యాన్ని తక్కువ చేసే పద్ధతిలో విలేకరులపై తప్పుడు కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ బుధవారం పలమనేరులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజాసమస్యల పట్ల మొట్టమొదట స్పందించి ప్రభుత్వం దష్టికి తీసుకొచ్చి పరిష్కారమార్గం చూపేది జర్నలిస్టులు మాత్రమే అని అన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలు ప్రతీ ఒక్కరికి ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు ఉందని, అలాంటి హక్కులకు భంగం కలిగించే విధంగా విలేకరులపై కేసులు బనాయించడం విడ్డూరమన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి పత్రికా ప్రతినిధులు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ప్రతీ 5సంవత్సరాలకు ఒకసారి మారుతుంటాయని ప్రజాప్రతినిధులు గ్రహించాలని, విలేకరులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటున్న పత్రికా స్వేచ్ఛను భంగం చేయడం దుర్మార్గం మని, తప్పు చేస్తే చర్యలు తీసుకోవాలని తప్ప, తప్పుడు కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు గిరిధర్ గుప్తా, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, రామాంజులు, రాజా, జయంతి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బదిలీల్లో అసంబద్ధ పాయింట్స్ తొలగించండి

డీఈవోకి ఏపీటీఎఫ్ వినతి




ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి, చిత్తూరు జిల్లాలో ఉపాధ్యాయుల వివిధ సబ్జెక్టుల వారీగా విడుదల చేయబడినవి. సబ్జెక్టుల వారీగా సీనియారిటీ ని పరిశీలించి జీవో-47కు విరుద్ధంగా కొంత మంది ఉపాధ్యాయులు ప్రమోషన్‌పై వచ్చి ఓల్ట్ స్టేషన్ పాయింట్స్ పొంది ఉన్నారని అన్నారు. కాబట్టి ఓల్ట్ స్టేషన్ జాబితాను క్షుణంగా పరిశీలించి ఫైనల్ సీనియార్టీ లిస్ట్‌లో సరిచేయాల్సిందిగా డిఈవోను కోరారు. స్పందించిన డిఈవో పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ముక్తార్ అహ్మద్, విజయ్‌కుమార్, అఫ్జల్, జగదీష్, మధు ఉన్నారు.

పారదర్శకంగా కౌన్సిలింగ్

40 మందికి పోస్టింగ్ : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పారదర్శకంగా ఏఎస్ఐ, కానిస్టేబుల్స్ నియామకం కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌పి వై.రిషాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ ఆఫీస్‌లో ఎస్పీ ఛాంబర్‌లో చిత్తూరు ఎస్పి, అడిషనల్ ఎస్పి అడ్మిన్ ఎల్.సుధాకర్ సమక్షంలో ఒకే స్టేషన్‌లో 5సంవత్సరాలు పూర్తిచేసుకున్న 13మంది ఏఎస్ఐలు, 7మంది హెడ్ కానిస్టేబుల్స్, 20మంది కానిస్టేబుల్స్‌కు కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్ స్టేషన్లలో ఉన్న ఖాళీల ద్వారా ఆయా సిబ్బంది వారు ఇచ్చిన రాతపూర్వక పోలీస్‌స్టేషన్ల అప్షన్స్ ద్వారా విచారించి వారందరికీ ఆయా పోలీస్‌స్టేషన్‌లో గల ఖాళీలను బట్టి వారు ఎన్నుకున్న పోలీస్‌స్టేషన్‌లో పారదర్శకంగా పోస్టింగ్స్ ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మీకు కేటాయించిన పోలీస్ స్టేషన్లలో రిపోర్ట్ చేసుకొని మీమీ విధులను నిష్పక్షపాతంగా, సక్రమంగా నిర్వర్తించి పోలీస్ డిపార్ట్మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని హితవు పలికారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ ఎల్.సుధాకర్, ఎస్‌బి డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, డిపిఒ క్లర్క్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్పి రిషాంత్‌రెడ్డి

కార్యాలయంలో పారిశుధ్య లోపం

ప్రజాశక్తి- విజయపురం
స్థానిక మండలంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో తాగునీరు పైపులైను మరమ్మతుకు గురై నీరు వధాగా పోతూ ఉంటే అధికారులు పట్టించుకోకపోవడంతో బుధవారం స్థానికులు విమర్శలు చేస్తున్నారు. కార్యాలయంలో కళ్లెదుటే తాగునీటిని అరికట్టని అధికారులు మండల సమస్యను ఎలా పరిష్కరిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు? అసలే వేసవికాలం అక్కడక్కడ గ్రామాల్లో తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే మండల కార్యాలయంలోని తాగునీటి లీకేజ్‌ని అరికట్టలేక పోతున్నారు. నిత్యం మండల కార్యాలయానికి వివిధ శాఖల అధికారులు వస్తూపోతున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



'డిప్యూటీ సీఎంకు ఓటమి ఖాయం'



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని 2024 ఎన్నికల్లో ఓడించి ప్రజలు ఇంటికి పంపడం ఖాయమని గంగాధర నెల్లూరు నియోజకవర్గ టిడిపి పరిశీలకులు మబ్బు దేవనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం మండల టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం కార్యక్రమంలో భాగంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనలో బాగంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి పై చేసిన ఆరోపణలపై ఇంతవరకు చర్చకు రాలేదని, అయితే అప్పుడప్పుడు మాజీ సీఎం చంద్రబాబునాయుడు, అతని కుమారుడు లోకేష్‌పై అవాకులు చవాకులు పేలడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా నారా లోకేష్ చేసిన ఆరోపణలపై తమ పార్టీ నారాయణస్వామితో బహిరంగంగా చర్చించడానికి సిద్ధంగా ఉందని, ఇప్పటికైనా చర్చకు వచ్చే దమ్ము మీకు ఉందా అని ధ్వజమెత్తారు. ఇప్పటికే గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో నారాయణ స్వామి పై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎవరికైతే టిక్కెట్టు కేటాయిస్తారో ఆ అభ్యర్థినే ఎమ్మెల్యేగా గెలిపించి చంద్రబాబు నాయుడుకి బహుమతిగా అందజేస్తామన్నారు. అంతకు ముందు పలువురు టిడిపి నేతలతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్ద చంద్రబాబు ఫ్లెక్సీకి జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ పాలాభిషేకం చేశారు. సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్ నాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు స్వామిదాస్, జయశంకర్ నాయుడు, రుద్రయ్య నాయుడు, చెంగల్రాయ యాదవ్ తదిరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం



ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని పసుపత్తూరు పంచాయతీకి సంబంధించిన మార్జేపల్లి, దిగువ గొర్రెలదొడ్డి గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రామీణ నీటి పారుదల, పారిశుధ్య శాఖలతో సుమారు రూ.23.47 లక్షలతో ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను నూతనంగా నిర్మించి తాగునీటి ట్యాంకులను బుధవారం స్థానిక శాసనసభ్యులు వెంకటే గౌడ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించినట్లు తెలియజేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో వైసీపీ నాయకులు



ప్రజాశక్తి-వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు మండల పరిధిలోని ఆత్మకూరు పంచాయతీ రాసిమరెడ్డి పల్లెలో నూతనంగా నిర్మించిన సంపద వినాయక కాళికాదేవి మహా కుంభాభిషేక వేడుకల్లో వైసీపీ నేత నూకతోటి రాజేష్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు గణేష్ బాబు, మహిమై దాసులు ఆలయ మర్యాదలతో సాంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నూక తోటి రాజేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు కామసాని ముని రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సినీ హీరో కృష్ణ జయంతి



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలో సూపర్ స్టార్ కృష్ణ 81వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆయన అభిమానులు గంగాధర నెల్లూరు బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో లోకనాథం, మోహన్, వెంకటేష్, బాలాజి, తూగుంద్రం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న మంత్రులు



ప్రజాశక్తి-పూతలపట్టు: టీడీపీ తొలిదశ మేనిఫెస్టో విడుదల చేసిన క్షణం నుంచి వైసీపీ నాయకులకు మతిభ్రమించి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆనగల్లు మునిరత్నం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలి నాళ్లలో టీడీపీ రాజకీయ బిక్షతో ఎదిగిన తమ్మినేని సీతారాం చట్ట సభను నడిపే స్థాయిలో ఉండి విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. బ్లాక్ కమెండోలను తొలగిస్తే చంద్రబాబును ఫినిష్ చేస్తామంటూ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో పేట్రేగుతున్న రాజ్యాంగేతర శక్తులకు, విద్రోహ చర్యలకు నిదర్శమని, స్పీకర్ తమ్మినేని వ్యాఖ్యల్లో కుట్ర కోణం ఉందని, చంద్రబాబుకి మరింత భద్రత పెంచాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం పంచాయతీ చలమంగళం గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం తాగునీటి సమస్య పరిష్కరించినట్లు స్థానిక సర్పంచ్ ఫజిలా, నాయకులు లతీఫ్ అన్నారు. గ్రామ ప్రజలు గత కొన్ని రోజులుగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తక్షణమే స్పందించిన సర్పంచ్, నాయకులు తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త మోటారు పైపులు వేయించి నీటి సమస్యను పరిష్కరించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సుబ్రమణ్యం, శశికళ, వైసీపీ నాయకులు అమర్, నారాయణ పాల్గొన్నారు.

మల్లారెడ్డికండ్రిగలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని మల్లారెడ్డికండ్రిగ గ్రామంలో బుధవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మూడవ రోజు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా గర్భిణులు, పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరాలు తగ్గిందని, అందరూ ఆరోగ్యంగా ఉన్నారని ఎంఎల్‌హెచ్‌పీ వినోలియా తెలిపారు. అలాగే గర్భిణులు, మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు జ్వరం బారిన పడకుండ జాగ్రత్త తీసుకోవాలని, ఎండలో తిరగకుంకా, నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. డాక్టర్ సలహా మేరకు ఐరన్ మాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం దివ్యప్రియ పాల్గొన్నారు.

వాహనాన్ని యజమాని గుర్తించాలి

ప్రజాశక్తి-తిరుపతి: 2021 వ సంవత్సరంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న కేసులో పట్టుబడ్డ ద్విచక్ర వాహనం యజమాని వాహనాన్ని గుర్తుపట్టి సరైన రికార్డులు తీసుకువస్తే సదరు వాహనాన్ని యజమానికి అందజేయడం జరుగుతుందని సోమల ఇన్‌ఛార్జ్ ఎస్ఐ మారుతి బుధవారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2021 వ సంవత్సరంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఎపి03 బిఆర్ 0736 నెంబరు కలిగిన హోండా డ్రీమ్ యోగ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆ తర్వాత సంబంధిత ద్విచక్ర వాహన యజమాని చిరునామా కోసం ఎంతో ప్రయత్నించామని తెలిపారు. ఇప్పటికైనా ద్విచక్ర వాహన యజమాని తనదే వాహనం అని గుర్తించి సరైన రికార్డులు తీసుకుని సోమల పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని, లేనిపక్షంలో సదరు వాహనాన్ని బహిరంగ వేలం వేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ


యాదమరి

ప్రజాశక్తి-సోమల: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన సదుం బస్టాండ్ కూడలిలో ర్యాలీ నిర్వహించి పొగాకు వాడటంతో కలిగే అనర్థాలపై నినాదాలను ప్రజలకు వినిపించారు. బుధవారం చెరుకువారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి గిరీష రెడ్డి ఆధ్వర్యంలో వైద్యాధికారి చరణ్, వైద్య ఆరోగ్య శాఖ బృందం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి చరణ్ మాట్లాడుతూ పొగాకు వాడటంతో ఊపిరితిత్తులు పాడవడం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, పక్షపాతం, రక్తనాళాలు దెబ్బ తినడం జరుగుతుందని తెలిపారు. పొగాకు వాడకం వద్దు ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య వైద్య పర్యవేక్షణ సిబ్బంది నీలకంత, నాగరత్నమ్మ, సతాజ్, సరస్వతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శ్రావణి, జానకి, విద్య, రషీద్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వ్యసనాలకు బానిస కాకూడదు అని తుంబకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్ రాయలు అన్నారు. బుధవారం మండలంలోని తగ్గువారిపల్లెలో గ్రామంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం కార్యక్రమం జరిగింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రమేష్, డిప్యూటీ పారామెట్రికల్ అధికారి మని, సిహెచ్ఒ షమీమ్ బేగమ్, మండల, ఆరోగ్య పర్యవేక్షకులు హరికృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరి: పొగాకు మీ జీవితాన్ని నాశనం చేస్తుందని, పొగాకును మానండి అనేక జబ్బుల బారి నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండి అని యాదమరి సిహెచ్ఒ లక్ష్మీనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుడితిరెడ్డిపల్లి గ్రామంలో ప్రజలకు పొగాకు వాడకంతో కలిగే నష్టాలను ఆయన వివరించారు. ఎంఎల్ఎహెచ్‌పి విష్ణు ప్రియ, మహిళా ఆరోగ్య కార్యకర్త విమల, ఆశా కార్యకర్తలు శ్రీమతి, మునిలక్ష్మి, బుడితిరెడ్డిపల్లి ప్రజలు పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ


శాంతిపురం

ప్రజాశక్తి-పులిచెర్ల: సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచులు ప్రతాప్ రెడ్డి, పోకల ఉమాదేవి గంగయ్య, ఉషారాణి నరసింహులు, ఎంపీటీసీ సభ్యులు పోకల చంద్ర, ఉషారాణి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి, మతుకువారిపల్లి, దేవలంపేట సచివాలయంలో బుధవారం సబ్సిడీ ధరలతో అందించే వేరుశనగ విత్తనాల పంపిణీ నిర్వహించారు. నాయకులు డీఎస్ గోవిందరెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, పోకల గంగయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలో రాయితీ వేరుశనగ విత్తన కాయలను రైతులకు వెదురుకుప్పం జడ్పీటీసీ సభ్యులు చలంపాళ్యం సుకుమార్ అందించారు. గ్రామ సచివాలయంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ జడ్పిటిసి సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ గుణశేఖర్ యాదవ్, మాంబేడు గ్రామ సచివాల సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు.

శాంతిపురం: సబ్సిడీ వేరుశనగ విత్తనాలు ఎమ్మెల్సీ కెఆర్‌జె. భరత్ చేతుల మీదుగా మండలంలోని రైతులకు బుధవారం పంపిణీ చేశారు. అనంతరం రైతులను ఉద్దేశించి ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ రైతు సోదరుల శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, అదనుకు ముందే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వేరుశనగ విత్తనాలు అందివ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎస్ శ్రీనివాసులు, ఎంపీపీ కె వసుంధర కోదండ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జి. అప్పోజి, మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రెస్కో మాజీ అధ్యక్షుడు జె చక్రపాణి రెడ్డి, సొన్నేగానిపల్లి, దండికుప్పం, సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలం చెల్లిన భవనాల్లో వసతి గృహాలు ఉండకూడదు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కాలం చెల్లిన పాత భవనాల్లో ప్రభుత్వ వసతి గహాలు ఉండ కూడదని ఈవోపీఆర్డీ లక్ష్మీపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ కాలం చెల్లిన పురాతన భవనాల్లో వసతి గహాలు నడపడం వల్ల పలు ప్రమాదాలు పొంచి ఉంటుందన్నారు. కళాశాల బీసీ వసతి గృహం చాలా పురాతన భవనంలో ఉండటాన్ని గుర్తించి వాటిని వెంటనే నూతన భవనానికి తరలించడానికి ఉన్నత అధికారుల దష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఎస్సీ బాలుర వసతి గృహం, బాలికల ఇంటిగ్రేడ్ వసతి గృహాలను సందర్శించారు. పాఠశాలలు శెలవు దినాల్లో కూడా వసతిగృహాల్లో వాచ్‌మెన్‌లు విధులు నిర్వహించాలని ఆదేశించారు. వసతి గృహాల ఆవరణాల్లో పరిశుభ్రత లోపించినట్లు పేర్కొన్నారు. వసతి గృహాలు ఆధునీకరణకు ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి మౌళిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. వారి వెంట మేజర్ పంచాయతీ కార్వేటినగరం ఈవో పీఎస్ మణి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు లోబడి జీవించాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: సమాజంలో జీవించే ప్రతి వ్యక్తి రాజ్యాంగం నిర్దేశించిన పౌర హక్కులకు లోబడి జీవించాలని మండల తహ శీల్దార్ హనుమంతు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొళత్తూరు గ్రామపంచాయతీ గ్రామంలోని ఎస్సీ కాలనీలో పౌర హక్కులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ రవికుమార్, గ్రామ రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు ఆర్థిక అక్షరాస్యత కల్పించండి

ప్రజాశక్తి-శాంతిపురం: మండల పరిధిలోని వెలుగు సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించి పొదుపుని పెంచుకుంటూ ఖర్చులు తగ్గించుకునే విధంగా వెలుగు శాఖలు పనిచేస్తున్నా సంఘమిత్రలు కృషి చేయాలని డిఆర్డిఎ పిడి తులసి తెలిపారు. బుధవారం మండల వెలుగు శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంతో ఐదు మండలాల సంఘమిత్రలకు చివరి రోజు శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. కార్యక్రమంలో డిపిఎం నాగేశ్వర రావు, ఏసీ చంద్రశేఖర్, ఏపీఎం గ్రీటా, సీసీ గోపీనాథ్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిరోధక చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-సోమల: మండలంలో బాల్యవివాహాలను అరికట్టేందుకు ఆయా శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేసి బాల్య వివాహ నిరోధక చట్టాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జడ్పిటిసి కుసుమకుమారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో బాల్య వివాహాల అంశంపై మండలంలో నాలుగు బాల్యవివాహాలు జరగడంపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. మండలంలోని నెల్లిమంద పంచాయతీలో ఇటీవల నాలుగు బాల్యవివాహాలు జరిగాయని కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని విజయలక్ష్మి సభకు తెలిపారు. విషయం తెలిసి తాము సంబంధిత దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చామని ఆమె చెప్పుకొచ్చారు. మహిళా స్త్రీ శిశుసంక్షేమ శాఖ సూపర్‌వైజర్‌ను ఈ విషయంపై మాట్లాడాలని సభ కోరగా బాల్య వివాహ చట్టాన్ని అమలుప రిచేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన వాలంటీర్ వ్యవస్థలో ప్రతి వాలంటీర్‌కు 50 కుటుంబాల వారి బాధ్యత ఉంటుంది.

మహాభారతం ఉత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలో మహాభారత ఉత్సవాలు మొదలయ్యాయి. ఈ ఉత్సవాలకు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మంచి అనుబంధం ఉంది. శ్రీకష్ణ ద్రౌపతి ధర్మరాజుల ఆలయాలు ఆయా పంచాయతీల్లో కూడలిలో ఏర్పాటు చేశారు. గతంలో ఈ ఉత్సవాలు 15 రోజుల నుంచి 45 రోజుల వరకు జరిపేవారు. ఈ ఉత్సవాలకు ఆలయ పరిధిలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేవారు. వింటే మహాభారతం వినాలి.. తింటే గారెలే తినాలి అనే నానుడి అప్పట్లో ఎంతో ప్రాచుర్యం పొందింది. పగలు హరికథ, రాత్రివేళలో నాటక ప్రదర్శనను ప్రదర్శించేవారు. కళాకారులను వీక్షించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేవారు. గతంలో శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు వారి ఉత్సవాలు 12 రోజులు నుంచి 45 రోజులపాటు నిర్వహించేవారు. కాలక్రమేన ఈ ఉత్సవాలకు అయ్యే ఖర్చు పెరగడంతో వాటిని దృష్టిలో ఉంచుకొని నిర్వాహకులు 12 రోజుల నుంచి 15 రోజుల వరకు కుదించారు.

సాంప్రదాయ పద్ధతిలోనే కొనసాగించాలి

ప్రతి సంవత్సరం ఈ అమ్మవారి ఉత్సవాలను సాంప్రదాయ పద్ధతిలోనే కొనసాగిస్తాం. సంక్రాంతి పండుగ తర్వాత ఈ ద్రౌపతి అమ్మవారి తిరునాళ్లే అంతటి ప్రాధాన్యత సంతరించుకుంది. అమ్మవారికి సేవ అందించడం అంటే ఎంతో సంతోషం, పూర్వజన్మ సుకృతం- **నరసింహారెడ్డి, కార్యనిర్వాహకుడు, చవటగుంట మహాభారతం వెదురుకుప్పం మండలం.**

అందరి సహకారంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తాం

అమ్మవారి ఆలయ పరిధిలో ఉన్న గ్రామాలలోని ప్రజల సహాయ సహకారాలతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తాం. శ్రీకారం కొడి కార్యక్రమంతో ఆలయంలోని ఉత్సవమూర్తులను బయటకు తీసుకువస్తాం. గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంటికీ కర్పూర హారతులకు ఆలయ పరిధిలోని గ్రామాలకు తీసుకెళ్తాం. గ్రామ పెద్దల సహాయ సహకారాలతో ఉత్సవ మూర్తులను ఊరేగించి పూజలు జరిపి ద్రౌపతి అమ్మవారి ఆలయానికి తీసుకువస్తాం.-**బండి ఉమాపతి రెడ్డి, ద్రౌపతి అమ్మవారి ఆలయ ధర్మకర్త, చవటగుంట, వెదురుకుప్పం మండలం.**

యోగాతో ఆరోగ్యం పదిలం



ప్రజాశక్తి-కార్వేటినగరం: యోగాసనాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పిజికల్ డైరెక్టర్ దామోధరం అన్నారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా కార్యక్రమానికి బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ విద్యార్థులు ఆట్లాడటం, యోగాసనాలు వేయడంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలరని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలపై ఆసక్తి పెంచుకుని శరీర దఢత్వాన్ని కాపాడు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా పద్మాసనం, భుజంగాసనం, శీర్షాసనం, సర్వాంగాసనం, వజ్రాసనం వంటి ఆసనాలపై అవగాహన కల్పించి వాటి యొక్క ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు, రాఘవేంద్రరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు కదలిరండి

ప్రజాశక్తి-విజయపురం: జిల్లా కేంద్రం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో గురువారం జరుగు మొదటి విడత రైతుభరోసా కార్యక్రమానికి విజయపురం మండల రైతులను ఆహ్వానిస్తున్నట్లు ఏవో రజినికుమారీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 4455 మంది రైతులు లబ్ధిపొందారన్నారు. వీరికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా మొత్తం రూ.3.34 కోట్లు రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. అలాగే సబ్సిడీ వ్యవసాయ యంత్రీకరణ పరికరం శుక్రవారం పంపిణీ జరుగుతుందని తెలియజేశారు.

సచివాలయం తనిఖీ



ప్రజాశక్తి-శాంతిపురం: మండల పరిధిలోని అబకల దొడ్డి, కడపల్లి పంచాయతీల గ్రామ సచివాలయాలను బుధవారం జిల్లా డిఆర్‌డిఎ పిడి తులసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత శాఖల రికార్డులను పరిశీలించి సచివాలయ ఉద్యోగులకు తగు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని ఉద్యోగులను హెచ్చరించారు. వెలుగు ఏసీ చంద్రశేఖర్, ఏపీఎం గ్రీటా, సిసి గోపీ, పంచాయతీ కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, బంగారు నాయక్, రెండు పంచాయతీల గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని పాతపేట గ్రామంలో గంగమ్మ జాతర శుభ సందర్భంగా సర్పంచ్ మమతారవిచంద్రన్ ఆహ్వానంతో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి సంయుక్త కార్యదర్శి దయానంద గౌడ్, పలమనేరు శాసనసభ్యులు వెంకటే గౌడ బుధవారం గ్రామానికి చేరుకున్నారు. గ్రామ పెద్దలు వారికి ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి దగ్గర పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామంలో విందు భోజనం ఆరగించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి తనయుడు శైలేష్ చక్రవర్తి అలియాస్ రాజు, వైసీపీ గౌడు మండల పరిధిలోని సర్పంచ్లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు విరాళం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: నియోజకవర్గ కేంద్రమైన గంగాధర నెల్లూరులో గత 199 రోజులుగా కొనసాగిన అన్నా క్యాంటీన్ జూన్ మొత్తం శ్రీరంగరాజ పురం మండల పార్టీ అధ్యక్షుడు జయశంకర్ నాయుడు దాతగా వ్యవహరిస్తారని ఈ సందర్భంగా మబ్బు దేవ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం అన్నదానం చేయడానికి ముందుకు వచ్చిన వెదురుకుప్పం మండల పార్టీ అధ్యక్షుడు లోకనాథరెడ్డి కోడలు పుట్టినరోజు సందర్భంగా దుర్గ ఢిల్లీబాబు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి మనోహర్ నాయుడు, గంగాధర నెల్లూరు మండల పార్టీ అధ్యక్షుడు స్వామి దాస్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అరుణ, యాదవ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సదుం మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సదుం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు భవనంలో గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాద్ బుధవారం తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రగతి నివేదికలతో తప్పక హాజరుకావాలని తెలిపారు.

నేరాలు-ఘోరాలు

ఘర్షణలో పశ్చిమ బెంగాల్ వాసి మృతి


మృతిచెందిన దయాల్ శంకర్

ప్రజాశక్తి-పలమనేరు: మొబైల్‌లో లూడో గేమ్ ఆడుతూ తలెత్తిన ఘర్షణలో పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తాకు చెందిన ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘటన పలమనేరులో చోటుచేసుకుంది. స్థానిక కోర్టు నూతన భవన నిర్మాణానికి దయాల్ శంకర్(50) కుటుంబంతో సహా వచ్చి భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇక్కడే రోని అనే ఇస్లాం యువకుడు కూడా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి మొబైల్‌లో ఇద్దరూ కలిసి లూడో గేమ్ ఆడుతూ ఘర్షణ పడ్డట్లు తోటి కార్మికులు తెలిపారు. ఘర్షణలో రోనీ ఇస్లాం (24), దయాల్ శంకర్ (50) తలపై రాడ్డుతో బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో హుటాహుటిన దయాల్ శంకర్‌ను పలమనేరు ఏరియా ఆసుపత్రికి అక్కడినుంచి చిత్తూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడు రోని ఇస్లాం కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఒ...


మృతుడు విఆర్‌ఒ శంకర్ స్వామి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఒ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు... వి.కోట మండలంలో విఆర్‌ఒగా శంకర్ స్వామి పనిచేస్తున్నాడు. బుధవారం ఓ వివాహానికి హాజరై స్వగ్రామమైన లక్కనపల్లికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే విఆర్‌ఒ మృతి చెందాడు. ఇతనికి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇతని మరణంతో కుటుంబ సభ్యులు అనాధలుగా మిగిలారు. విధి నిర్వహణలో ఉన్న విఆర్‌ఒ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని వారి కుటుంబ సభ్యులకు ఒక ఉద్యోగం ఇప్పించాలని స్థానికులు కోరుతున్నారు. స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎస్సై వెంకట నరసింహులు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని కారులో ప్రయాణిస్తున్న వారిని విచారించగా ప్రమాదవశాత్తు కారు ముందర టైర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగిందని వారు తెలిపారు. కేసు నమోదు చేసి మృతి చెందిన విఆర్‌ఒను పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. సంఘటనకు కారణాలు ఇంకనూ తెలియాల్సి ఉంది. వి.కోట తహశీల్దార్ మురళి తన సిబ్బందితో బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లి గ్రామంలోని విఆర్‌ఒ మృతదేహానికి నివాళులర్పించి, ప్రభుత్వం తరపున అంత్యక్రియలకు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేసి, మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పాము కాటుతో వ్యక్తి...

ప్రజాశక్తి-పులిచెర్ల: పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు... పులిచెర్ల మండలం కావేటిగారి పల్లి పంచాయతీ విసివడ్డిపల్లికి చెందిన ఎం.తేజ (33) తన రేకుల ఇంటిలో భార్య పిల్లలతో కలిసి మంగళవారం రాత్రి నిద్రకు ఉపక్రమించాడు. బుధవారం వేకువజామున పాము కరవడంతో కుటుంబ సభ్యులకు పాము కరిచిన విషయం తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో తేజ పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం పీలేరు ప్రభుత్వాసుపత్రిలో తేజ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ద్విచక్ర వాహనదారునికి గాయాలు

ప్రజాశక్తి-వి.కోట: పలమనేరు–కుప్పం ప్రధాన రహదారిలోని కైగల్ బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు.. బైరెడ్డిపల్లి పాతపేట చెందిన అశోక్ (28) ద్విచక్ర వాహనంలో బుధవారం వి.కోటకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కైగల్ బ్రిడ్జి దగ్గర ఈచర్ వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అశోక్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కుప్పం మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు వి.కోట పోలీసులకు సమాచారం అందింది.

అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



ప్రజాశక్తి-పుంగనూరు: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సీతారామరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. పుంగనూరు నుంచి పలమనేరు రోడ్‌లోని కరసనపల్లి మలుపు వద్ద పుంగనూరు ఎస్ఈబి పోలీసులు జరిపిన దాడుల్లో ఆటోలో కర్ణాటక మద్యం అక్రమంగా రవాణా చేస్తున్న పుంగనూరుకు చెందిన సయ్యద్ అష్రాఫ్ అలీ కుమారుడు ముదస్సిర్ బాషాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం అతని వద్ద నుంచి ఐ వాట్స్ విస్కీ, టెట్రాపాకెట్స్ , 384 సిల్వర్ కప్ బ్రాందీ ప్యాకెట్లు కర్ణాటక మద్యం, దీంతోపాటు అప్పి ఆటో స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ మద్యం విలువ రూ.45 వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉప విద్యుత్ రెవిన్యూ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సదుం సమీపంలోని భట్టువారి పల్లి వద్ద రూ.2 కోట్లతో నిర్మించనున్న డీఈఈ ఎలక్ట్రికల్ రెవెన్యూ భవన నిర్మాణానికి జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి బుధవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్సీ కష్ణారెడ్డి, ఈఈ విద్యన్, ఏడీఈ నరేంద్ర, ఏఈ సదుం చంద్రశేఖర్, సోమల మహేందర్ రెడ్డి, కల్లూరు ఏఈ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

